సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



నేటి నుంచి ఉత్సవాలు

మద్దిమడుగు ఆంజనేయస్వామి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



నేల ఆరోగ్యం కోసం..

నేల ఆరోగ్యం కోసం సేంద్రియ ఎరువులు ఉపయోగించాలని శాస్త్రవేత్తలు అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.8 /14.2

చలి తీవ్రత అధికంగా ఉండడంతోపాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు ఇంటర్వ్యూ

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ సైన్స్ కళాశాలలో డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9963729195 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు జిల్లాస్థాయి యువజనోత్సవాలు

కందనూలు: స్వామి వివేకానంద జయంతి, 27వ జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక సాయి గార్డెన్‌లో జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించున్నట్లు డీవైఎస్‌ఓ సీతారాం గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని యువ కళాకారులను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జానపద నృత్యం, గేయాలు, కథారచన, పోస్టర్ తయారీ, ఫొటోగ్రఫీ తదితర విభాగాలలో పోటీలు ఉంటాయని, 15నుంచి 29ఏళ్ల వయసు గల విద్యార్థులు అర్హులని తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు



కందనూలు: వైకుంఠ ఏకాదశి వేడుకలకు వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. శ్రీపురంలోని పురాతన రంగనాయకస్వామి ఆలయంతో పాటు జిల్లా కేంద్రంలోని రామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజామున 5:30 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనాలు ప్రారంభమవుతాయి. రంగనాయక స్వామి ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలిరానున్నారు. తెల్లవారుజామున గరుడ వాహనసేవ, ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి దర్శనం కల్పించనున్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల పరిశీలకుడిగా సామరమేష్



నాగర్‌కర్నూల్ రూరల్: కొమురంభీం జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–17 ఖోఖో పోటీల పరిశీలకుడిగా జిల్లా కేంద్రానికి చెందిన క్రీడా ఉపాధ్యాయుడు సామరమేష్ నియమితులయ్యారు. ఉమ్మడి 10 జిల్లాల బాలబాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని, తనను పరిశీలకుడిగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. జీహెచ్‌ఎం యాదయ్య, ఉపాధ్యాయులతో పాటు జెడ్పీటీసీ శ్రీశైలంయాదవ్, ఎంపీటీసీ కృష్ణయ్య, ఏకలవ్య క్లబ్ సంఘం నాయకులు, సీతారామ సంఘం నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పాత్రికేయుల సహకారం మరవలేనిది

నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో పాత్రికేయులు అందించిన సహకారం మరవలేనిదని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ ఎన్‌ఐసీ సమావేశం మందిరంలో గురువారం పాత్రికేయులకు తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో విజయవంతంగా ఎన్నికలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజలకు అనుసంధానంగా వ్యవహరిస్తూ ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, ఏపీఆర్‌ఓ తిరుపతయ్య, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ జాకీర్‌అలీ, డీటీ బాలరాజ్, రఘు, కలెక్టర్ పీఎస్ ఖాజా మైనొద్దీన్ తదితరులు ఉన్నారు.

24 నుంచి తరగతులు ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ, డిగ్రీ తరగతులు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులకు వచ్చే విద్యార్థులు ఫీజుల రశీదులతో హాజరై, యూనివర్సిటీ నుంచి వచ్చిన పుస్తకాలు తీసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ నం.73829 29609ను సంప్రదించాలని ఆయన సూచించారు.

బీ అలర్ట్..

మళ్లీ కోవిడ్ కలకలం



- రాష్ట్రంలో జేఎన్–1 వేరియంట్ గుర్తింపు
- వైద్యారోగ్య శాఖ అధికారుల అప్రమత్తం
- మాస్క్ ధరించడంతో పాటు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపు
- జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డుల ఏర్పాటు
- ఆక్సిజన్, మందులు, ఇంజక్షన్ల కొరత లేకుండా చర్యలు

ప్రపంచవ్యాప్తంగా గడగడలాడించిన కోవిడ్ మహమ్మారి మరోసారి తరుముకొస్తోంది. రాష్ట్రంలో ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన జేఎన్1 సబ్ వేరియంట్ కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. అనుమానం ఉన్న వారికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో తీసుకోవాల్సిన చర్యలను సూచించింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కరోనా కేసులు లేవు. రానున్న రెండు, మూడు వారాల్లో పాజిటివ్ కేసులు పెరిగే అవకాశం ఉందనే అంచనాతో జిల్లా వైద్య శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ బెడ్లు

జిల్లాల వారీగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో ఏర్పాట్లు ఇలా..

	మ.నగర్	నా.పేట	నా.కర్నూల్	జో.గద్వాల	వనపర్తి
ప్రత్యేక వార్డులో పడకలు	560	10	100	40	62
ఆక్సిజన్ సౌకర్యం ఉన్నవి	500	40	52	140	150
వెంటిలేటర్లు ఉన్నవి	60	4	37	10	24
లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్	2	1	1(పీఎస్‌ఏ)	1	-
ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు	47	50	-	7	4
బెడ్‌సైడ్ కాన్సంట్రేటర్లు	47	30	26	15	-



అందుబాటులో ఉన్న ఆర్టీపీసీఆర్ కిట్లు ఇలా..

జిల్లా	కిట్లు
మహబూబ్‌నగర్	521
నారాయణపేట	200
నాగర్‌కర్నూల్	4,000
జోగుళాంబ గద్వాల	500
వనపర్తి	400

పీహెచ్‌సీల్లో సైతం..

జిల్లాకేంద్రాల్లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా గురువారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు పీహెచ్‌సీల్లో కోవిడ్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టుల కిట్లు, కరోనా పాజిటివ్‌తో బాధపడుతున్న వారికి అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఎక్కడా మందులు, ఇంజక్షన్ల కొరత లేకున్నా.. నిల్వ చేసుకునే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు టీఎస్‌ఎంఎస్ ఐడీసీ నుంచి సమకూర్చుకునేలా జిల్లా వైద్యశాఖ అధికారులు ఆయా పీహెచ్‌సీల నుంచి ఇండెంట్లను తెప్పించుకుంటున్నారు.

ప్రతి బెడ్‌కూ ఆక్సిజన్..

కరోనా ఫస్ట్, సెకండ్ వేవ్‌లో రాష్ట్రంలో పలు ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లా అధికారులు ముందస్తుగా జాగ్రతలు తీసుకున్నారు. అన్ని పడకలకు ఆక్సిజన్ సరఫరా అయ్యేలా ఇదివరకే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో రెండు (ఒకటి 13 వేల లీటర్లు, ఇంకోటి వెయ్యి లీటర్ల సామర్థ్యం గల) లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకులు అందుబాటులో ఉన్నాయి. వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో 140 ఆక్సిజన్ సిలిండర్లు, గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో 500 ఎల్‌పీఎం సామర్థ్యం గల లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులో ఉంది.

అన్ని ఏర్పాట్లు చేశాం..



కోవిడ్ బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జనరల్ ఆస్పత్రిలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసి, ఆక్సిజన్ బెడ్లు, వెంటిలేటర్లు అందుబాటులో ఉంచాం. కోవిడ్ రోగులకు అవసరమయ్యే మందులు అందుబాటులో ఉన్నాయి. దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు కోవిడ్ పరీక్షలు చేయించుకుని వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వం విధించే కోవిడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.

– డా.రఘు, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, నాగర్‌కర్నూల్

ప్రత్యేక ఐసోలేషన్ వార్డు, ఐసీయూ..



నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కోవిడ్ వార్డు

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల పరిధిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా కోవిడ్ ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఐసీయూ వార్డుతో పాటు కోవిడ్ నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఆయా జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు ఫార్మసిస్టులు ఇతర వైద్య సిబ్బందితో సమావేశమై పీపీఈ కిట్లు, డిస్పోసబుల్ బెడ్ షీట్లు, మాస్కులు, శానిటైజర్లు, కోవిడ్ చికిత్సకు అవసరమైన మందులతో పాటు కోవిడ్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టుల కిట్లు స్టాక్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఓటర్ల నమోదుకు సహకరించండి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

- అవసరమైన చోట పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలి
- అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్: 2024 జనవరి ఒకటోతేదీ నాటికి 18ఏళ్లు పూర్తి చేసుకునే వారందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు కోరారు. ఐడీఓసీ కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రకారం అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితాలో చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రాబోయే ఎన్నికలకు అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఒకచోట నుంచి మరో చోటుకు మార్చడం, అవసరంలేని చోట తొలగించడం వంటివి ఏమైనా ఉంటే ప్రతిపాదనలు పంపించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌కు ఇది సువర్ణావకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న 3వేలకుపైగా దరఖాస్తుల అభ్యంతరాలను ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓల ద్వారా పరిష్కరించేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగింపుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, నోటీసులు జారీచేసిన అనంతరం తొలగింపులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నుంచి వెంకటయ్య, కాంగ్రెస్ డేవిడ్‌రాజ్, బీజేపీ శ్రీనివాసులు, వైఎస్సార్‌టీపీ హుస్సేన్, టీడీపీ బాలకృష్ణ, ఎలక్షన్ సూపరింటెండెంట్ జాకీర్ అలీ, డీటీ రఘు పాల్గొన్నారు.

ఈవీఎంల స్ట్రాంగ్‌రూం పరిశీలన

జిల్లా కేంద్రంలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎంల స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సీతారామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, అలంపూర్‌లకు సంబంధించి స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట ఇన్‌చార్జి ఆర్డీఓ రాంరెడ్డి, జిల్లా కోఆపరేటివ్ అధికారి పత్యానాయక్, జిల్లా సివిల్‌సప్లై అధికారి స్వామికుమార్, డీఎం బాలరాజ్, మార్కెటింగ్ అధికారిణి బాలమణి తదితరులు ఉన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



రివార్డులు అందుకున్న సిబ్బందితో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొందాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బాధ్యతాయుతంగా పనిచేసిన సిబ్బందికి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో రికార్డులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలీస్ ఎలక్షన్ సెల్ సిబ్బంది అంకిత భావంతో పనిచేశారని.. రాబోవు ఎంపీ, పంచాయతీ ఎన్నికల్లోనూ మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లో అలసత్వం వహించొద్దని, ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ విజ్ఞాన్

తాడూరు: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ విజ్ఞాన్ తెలిపారు. తాడూరు, ఐతోలు తదితర గ్రామాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ, ప్రాజెక్ట్ అసిస్టెంట్ శంకరయ్యలు చేపట్టిన సర్వేను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్ల పనితీరుతో పాటు పిల్లలపై తీసుకుంటున్న శ్రద్ధ, బోధన, పూర్వ ప్రాథమిక విద్య ఏ విధంగా అందిస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం కోసం వివిధ స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వెల్దండలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉమామహేశ్వర్‌రెడ్డి

కల్వకుర్తి టౌన్/వెల్దండ: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పర్యావరణ శాస్త్రవేత డా. ఉమామహేశ్వర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని బాలుర పాఠశాల, వెల్దండ ఉన్నత పాఠశాలల్లో గురువారం పర్యావరణ సమతుల్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి నష్టం చేకూర్చే ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ సమతుల్యత లోపిస్తే అనేక అనర్థాలకు దారితీస్తుందన్నారు. ప్రకృతిలో మార్పులు సంభవించి భూకంపాలు, తుఫాన్‌లు వంటి వాటితో తీవ్రనష్టాన్ని చూడాల్సి వస్తుందన్నారు. పర్యావరణాన్ని కాపాడి భావితరాలకు బంగారు భవిష్యత్ అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, ఇన్‌చార్జి ఎంఈఓ శంకర్‌నాయక్, బాసునాయక్, హెచ్‌ఎంలు బాలు, రవికిరణ్ పాల్గొన్నారు.

కాసుల గలగల

- ఏడాదిలో 92,385 డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్
- ప్రభుత్వానికి సమకూరిన రూ.241.53 కోట్ల ఆదాయం
- అత్యధికంగా జడ్చర్ల, అత్యల్పంగా అలంపూర్‌లో క్రయవిక్రయాలు
- ఉమ్మడి జిల్లాలో గతేడాది కంటే పెరిగిన రిజిస్ట్రేషన్లు



మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

జనవరి నుంచి నవంబర్ వరకు జరిగిన రిజిస్ట్రేషన్, ఆదాయం వివరాలు..

ప్రాంతం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం (రూ.కోట్లలో..)
జడ్చర్ల	15,376	57.59
వనపర్తి	14,950	35.36
మహబూబ్‌నగర్	13,773	55.60
గద్వాల	12,958	24.76
కల్వకుర్తి	7,961	19.25
నాగర్‌కర్నూల్	6,997	11.86
నారాయణపేట	6,935	16.11
అచ్చంపేట	3,448	4.52
కొల్లాపూర్	3,107	3.90
మక్తల్	2,563	6.80
ఆత్మకూర్	2,387	3.04
అలంపూర్	1,930	2.68

పాలమూరు: ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్స్ శాఖ నుంచి ప్రభుత్వానికి ఆదాయం అధికంగా సమకూరుతుంది. కొంతమేర అన్నిరకాల రిజిస్ట్రేషన్లు తగ్గినా.. ఆదాయం మాత్రం అధికంగానే వస్తోంది. దీనికి తోడు రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం పెరగడంతో స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖకు కాసుల పంట పండుతోంది. పెరిగిన రిజిస్ట్రేషన్ల ధరలతో ఆదాయం రెట్టింపు అయ్యింది. ఉమ్మడి జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధిక ఆదాయం జడ్చర్ల కార్యాలయం నుంచి వచ్చింది. జడ్చర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా జరగడంతోపాటు జాతీయ రహదారి, హైదరాబాద్‌కు దగ్గరలో, పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో అక్కడి భూములకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీనికితోడు ఏటా క్రయవిక్రయాలు అధికంగానే జరుగుతాయి. అతి తక్కువగా అలంపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో జరిగాయి. జడ్చర్లలో 15,376 రిజిస్ట్రేషన్స్ కాగా అలంపూర్‌లో 1,930 మాత్రమే అయ్యాయి.

ఉమ్మడి జిల్లా పరిధిలో..

ఉమ్మడి జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ ఏడాది జనవరి నవంబర్ వరకు 92,385 డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ అయితే వీటి వల్ల ప్రభుత్వానికి రూ.241.53 కోట్ల ఆదాయం సమకూరింది. అత్యధికంగా జడ్చర్ల పరిధిలో 15,376 డాక్యుమెంట్స్ ద్వారా రూ.57.59 కోట్లు, తక్కువగా అలంపూర్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో 1,930 డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ అయితే రూ.2.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో స్టాంపు విక్రయాల ద్వారా రూ.181.69 కోట్ల ఆదాయం, బదలాయింపు పన్ను ద్వారా రూ.22.33 కోట్లు, రిజిస్ట్రేషన్ సేవల ద్వారా రూ.37.50 కోట్ల ఆదాయం వచ్చింది.

బీజేపీ నియంతృత్వ ధోరణి వీడాలి

తాడూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణి వీడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పార్లమెంట్‌లో చోటు చేసుకున్న పొగబాంబులపై సమగ్రంగా చర్చించి, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా నోరు మూయించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఇటీవల 141 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కాశన్న, ఆంజనేయులు, శ్యాంసుందర్, వెంకటస్వామి ఉన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: సమాజానికి క్రీస్తు అందించిన బోధనలు అనుసరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని మానస గార్డెన్స్‌లో గురువారం జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి క్రైస్తవులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రేమ, సహనం, శాంతి కలిగి ఉండటంతో పాటు దయాగుణంతో వ్యవహరించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని తెలిపారు. అనంతరం క్రైస్తవ యువకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కల్వకుర్తి, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్లు సత్యం, రాంపాల్‌నాయక్, ఎంపీపీ మనోహర, ఆర్డీఓ శ్రీను, తహసీల్దార్ జహంగీర్, మాజీ ఎంపీ జగన్నాథం పాల్గొన్నారు.



చాంపియన్‌గా నిలిచిన అండర్‌-14 నెట్‌బాల్ బాలుర జట్టు



రన్నరప్‌గా నిలిచిన అండర్‌-17 జట్టు

నెట్‌బాల్‌లో మెరిసిన పాలమూరు

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో గురువారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలుర జట్లు అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకున్నాయి. అండర్‌-14 విభాగం రాష్ట్రస్థాయి పోటీల్లో బాలుర జట్టు చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో బాలుర జట్టు 14-3 పాయింట్ల తేడాతో ఖమ్మంపై విజయం సాధించింది. అండర్‌-17 విభాగంలో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఇరు జట్లను ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, సహాయ కార్యదర్శి వేణుగోపాల్ అభినందించారు. భవిష్యత్‌లు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

– మహబూబ్‌నగర్ క్రీడలు

భక్తుల కొంగు బంగారం..
పబ్బతి హనుమాన్



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

- మద్దిమడుగు క్షేత్రంలో నేటి నుంచి దీక్ష విరమణ ఉత్సవాలు
- 26న హనుమాన్ గాయత్రీ మహాయజ్ఞం



ప్రత్యేక అలంకరణలో పబ్బతి హనుమాన్

అమ్రాబాద్: తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఒకటైన మద్దిమడుగులో దీక్షా మాల విరమణ ఉత్సవాలు శుక్రవారం నుంచి 26 వరకు వైభవంగా జరగనున్నాయి. ఇక్కడ వెలిసిన పబ్బతి ఆంజనేయ స్వామిని పిలిస్తే పలికే దైవంగా, కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తులు పూజిస్తారు. నల్లమల కొండల్లో ప్రకృతి రమణీయ ప్రదేశంలో వెలిసిన అంజన్న క్షేత్రం శ్రీశైలానికి ఉత్తర దిశగా ఉంటుంది. ఈ ఆలయానికి వేల ఏళ్ల చరిత్ర ఉందని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

మద్దిమడుగులో ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మాల విరమణ భక్తులకు ప్రత్యేకషెడ్లు ఏర్పాటు చేశారు. నీటి సమస్య లేకుండా (సింతటిక్) మినీ ట్యాంకులు ఉన్న స్నాన ఘట్టాలతో పాటు మరో 24 స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. పదరప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఇక్కడ జరిగే ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా నల్గొండ, హైదరాబాద్, ఏపీ తదితర ప్రాంతాల నుంచి మాల ధరించిన స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. ఈ నేపథ్యంలో మాచర్ల, దేవరకొండ, మిర్యాలగూడా, అచ్చంపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్ డిపోల నుంచి ఆర్టీసీ బస్సులను నడుపనున్నారు.

ఏటా రెండుసార్లు ఉత్సవాలు

మద్దిమడుగు ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఏటా రెండు పర్యాయాలు జరుగుతాయి. కార్తీక మాసంలో దీక్షమాల విరమణ, చైత్రమాసంలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయ స్వామి మాలను ధరిస్తారు. 40 రోజుల కఠోర దీక్ష అనంతరం ఇరుముడులతో ఆలయం వద్దకు వచ్చి స్వామివారికి సమర్పించి దీక్ష విరమణ చేస్తారు.

ఉత్సవాల వివరాలు..

- 22న ఉదయం నిత్యార్చన, విఘ్నేశ్వరపూజ పుణ్యాహవచనం, పంచగవ్యం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ
- 23 విఘ్నేశ్వరపూజ, పంచగవ్యం, వాస్తుపూజ హోమం, రుద్రహోమం, సహస్రనామార్చన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, నిత్యోపాసన, మన్యుసూక్తహోమం, తీర్థప్రసాద వితరణ, రాత్రికి అమ్మవారి సేవ
- 24న విఘ్నేశ్వరపూజ, గవ్యాంతపూజలు, రుద్రహోమం, నిత్యోపాసన, బలిహరణ, మహానివేదన, నీరాజన మంత్ర పుష్పములు, శివపార్వతుల కల్యాణం
- 25న విఘ్నేశ్వరపూజ, గవ్యాంతరపూజలు, రుద్రహోమం, నిత్యోపాసన, హనుమత్ వ్రతం, తీర్థ ప్రసాదవితరణ, సీతారాముల కల్యాణం
- 26న గవ్యాంతపూజలు, ఆంజనేయ స్వామికి 108 కలశాలతో అభిషేకం, హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ తెలిపారు.

క్లుప్తంగా

ఉరేసుకొని వ్యక్తి మృతి

జడ్చర్ల: అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని నెక్కొండలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెక్కొండకు చెందిన శివయ్య(28) తెల్లవారుజామున నిద్రలేచి వ్యవసాయ పొలం దగ్గరకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయన మృతిపై భార్య మంజుల, బంధువులు అనుమానంతో ఆందోళన వ్యక్తం చేశారు. తన భర్త ఆత్మహత్య చేసుకోలేదని, తనకు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు అంగీకరించకపోవడంతో సీఐ రమేశ్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. పోస్టుమార్టం నివేదిక మేరకు దర్యాప్తు చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాద్వార్‌లో విషాదం

మక్తల్: కూతురి పుట్టినరోజు సందర్భంగా కేక్ తెచ్చేందుకు వెళ్లిన తండ్రి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం తీవ్ర విషాదం రేపింది. ఈ ఘటన మక్తల్ మండలం మాద్వార్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మాద్వార్‌కు చెందిన తుంగరాము (30) తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా బుధవారం రాత్రి కేక్ తెచ్చేందుకు అదే గ్రామానికి చెందిన రఘుతో కలిసి బైక్‌పై మక్తల్‌కు వెళ్లి వస్తుండగా.. గ్రామ సమీపంలో బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. తుంగ రాము మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య నవీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆచారి తెలిపారు.

మొసలి కలకలం



గట్టు: గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామశివారులో గురువారం మొసలి సంచారం కలకలం రేపింది. నెట్టెంపాడు కాల్వ సమీపంలోని రైతు పోతుల రామయ్య పొలంలో ఉన్న నీటిగుంతలో మొసలి కనిపించడంతో సమీప వ్యవసాయ పొలాల రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులు, గొర్రెలు, చిన్న పిల్లలు అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మొసలి బారి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

భూ తగాదాపై కేసు నమోదు

జడ్చర్ల: బూరెడ్డిపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న భూమి విషయంలో బుధవారం జరిగిన దాడి ఘటనపై గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. బాధితుడు గూళ్ల సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. కాగా నిందితులు విచక్షణా రహితంగా కర్రలతో దాడులు చేశారని చర్యలు చేపట్టాలని బాధితుల తరపున గ్రామస్తులు సీఐ కలిసి విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి
పరిహారం చెల్లించాలని ఆందోళన



కొల్లాపూర్‌లోని ఆస్పత్రి ఎదుట గూమిగూడిన మృతురాలి బంధువులు

- కొల్లాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యురాలితో వాగ్వాదం
- ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన వైద్యురాలు
- రాజీకుదిర్చిన మధ్యవర్తులు

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోం వద్ద గురువారం కొందరు ఆందోళనకు దిగారు. బాలింత మృతికి మీ నిర్లక్ష్యమే కారణం అంటూ వైద్యురాలితో వాగ్వాదానికి దిగారు. ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్ వరకు చేరింది. చివరికి మధ్యవర్తులు రాజీ కుదిర్చారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకొత్తపల్లి మండలం యాపట్లకి చెందిన రజిత(21)కు ఏడాదిన్నర కిందట చారకొండ మండలం తుర్కలపల్లికి చెందిన సురేష్‌తో వివాహమైంది. రజిత గర్భిణి కావడంతో కొల్లాపూర్‌లోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో ఈ నెల 3న ఆమెకు కాన్పు చేయించారు. సాధారణ కాన్పులో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. హెర్నియా సమస్య కారణంగా ఆమె ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆస్పత్రి వైద్యురాలు మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేశారు. అక్కడ కూడా ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఈ నెల 16న మృతిచెందింది. మృతురాలి కుటుంబీకులు కొందరు స్థానిక నాయకులతో కలిసి గురువారం సంబంధిత డాక్టర్ వద్దకు వెళ్లారు. రజిత అమ్మమ్మగారి ఊరు పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం కావడంతో ఆ మండలానికి చెందిన హరిప్రసాద్, గోపినాయక్, తెలంగాణ దళితదండు నాయకులు బచ్చలకూర బాలరాజు మృతురాలి కుటుంబం తరఫున వైద్యురాలితో మాట్లాడారు. సరైన వైద్యం అందకపోవడంతోనే ఆమె మృతిచెందింది. ఆమె బిడ్డకు తల్లి లేకుండా పోయింది. ఆ కుటుంబానికి పరిహారం చెల్లించాలని కోరారు. ఈ క్రమంలో వైద్యురాలిపై కొందరు దురుసుగా మాట్లాడారు. దీంతో ఆమె వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లింది. పట్టణానికి చెందిన ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు ఆమెకు సంఘీభావంగా స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో వైద్యురాలికి, మృతురాలి తరఫున వచ్చిన వారికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక నాయకులు కొందరు జోక్యం చేసుకుని ఇరువురి మధ్య రాజీ కుదిర్చారు. రూ.లక్ష పరిహారం చెల్లించేలా వైద్యురాలిని ఒప్పించినట్లు తెలిసింది. అయితే పరిహారం చెల్లింపు విషయంలో ఎటువంటి స్పష్టత రాలేదని, శుక్రవారం మరోసారి చర్చలు జరుపుతామని మృతురాలి తరఫు వారు తెలిపారు. ఈ ఘటనపై ఇరువర్గాలు తమకు ఎటువంటి ఫిర్యాదులు ఇవ్వలేదని ఏఎస్‌ఐ రామస్వామిగౌడ్ తెలియజేశారు.

సీజ్ చేసినా..
మద్యం బార్ నిర్వహణ

జడ్చర్ల: ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసిన మద్యం బార్ యథావిధిగా కొనసాగడం జడ్చర్లలో చర్చనీయాంశంగా మారింది. 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఓ స్టార్ హోటల్లో నిర్వహిస్తున్న బార్ నుంచి గత నెల 15న ఎన్నికల సమయంలో నిబంధనలను ఉల్లంఘించి డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా మద్యం తరలిస్తుండగా జీఎస్టీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బార్‌లో ఉండాల్సిన మద్యం కాటన్లు ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా బయటకు తరలించడంపై ఎక్సైజ్ అధికారులు విచారించి బార్‌ను సీజ్ చేశారు. ఎక్సైజ్ అధికారుల నిబంధనలను బేఖాతరు చేస్తూ బార్‌ను నిర్వాహకులు యథావిధిగా మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక విలేకరులు ఎక్సైజ్ సీఐ బాలాజీ దృష్టికి తీసుకెళ్లారు. తాము మద్యం బార్‌ను సీజ్ చేశామని, బార్‌ను మళ్లీ యథావిధిగా కొనసాగిస్తుండడంపై తమకు తెలిసిందన్నారు. మరోసారి విచారించి బార్‌ను సీజ్ చేస్తామని ఆయన తెలిపారు.

హాకీ తెలంగాణ ఉపాధ్యక్షుడిగా గోటూరు



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో గురువారం హాకీ తెలంగాణ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన గోటూరు శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. శ్రీనివాస్‌గౌడ్ ప్రస్తుతం హాకీ మహబూబ్‌నగర్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. లాల్‌కోట జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఈటీగా పనిచేస్తున్నారు. ఈయన ఎంపికపై వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

సృజనాత్మకత పెంపే లక్ష్యం

- రాష్ట్రస్థాయికి ఎంపికైన పెబ్బేర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు



వనపర్తిటౌన్: విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని వారు ఎంచుకున్న సబ్జెక్టులో పెంపే లక్ష్యంగా సైన్స్‌ఫెయిర్ తరహా ప్రదర్శనలకు సాంకేతిక విద్యాశాఖ శ్రీకారం చుట్టిందని వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ కోర్సుల విభాగాలకు చెందిన ఉమ్మడి కళాశాలల విద్యార్థులకు సృజన టెక్ ఫెస్ట్ పేరిట గురువారం పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలకు ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, పెబ్బేరు(మహిళ కళాశాల) నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుకు ఆరుగురు చొప్పున విద్యార్థులు నమూన ప్రదర్శనలు తీసుకొచ్చారు. ఈ నమూనా ప్రదర్శనలో పెబ్బేర్ కళాశాల విద్యార్థులు శబ్దం నుంచి విద్యుత్ తయారు చేసే ప్రాజెక్టు చేపట్టారు. ఈ ప్రాజెక్టు న్యాయనిర్ణేతలను, ఆహుతులను విశేషంగా ఆకట్టుకోవడంతో ఉమ్మడి జిల్లా ప్రథమ స్థానం దక్కించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. న్యాయనిర్ణేతలు బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ కార్తీక్‌రెడ్డి, జేపీఎన్‌సీఈ ఈసీఈ హెడ్ రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచాలి



విద్యార్థులు తయారు చేసిన వాహనాన్ని పరిశీలిస్తున్న బృందం


- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరీ

కోస్గి: విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందించడంతో పాటు, పరిశోధనలపై ఆసక్తి పెంచి, వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరీ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో 'సృజన టెక్‌ఫెస్ట్‌-2023' పేరుతో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రతి సంవత్సరం మెకానికల్ విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించే సృజన టెక్‌ఫెస్ట్‌-2023 కార్యక్రమాన్ని ఈ ఏడాది కోస్గి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించగా.. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, వడ్డేపల్లి, కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొని వివిధ ప్రదర్శనలు ఇచ్చారు. ఆయా కళాశాలల విద్యార్థులు ఇచ్చిన ప్రాజెక్టుల్లో మహబూబ్‌నగర్ కళాశాల విద్యార్థులు ఇచ్చిన ఎలక్ట్రిక్ గో కార్ట్ ప్రదర్శన ప్రథమ బహుమతి పొందగా.. కోస్గి కళాశాల విద్యార్థులు ఇచ్చిన డ్యూయల్ ఆక్సిస్ స్టీరింగ్ మెకానిసమ్ ద్వితీయ బహుమతి సాధించినట్లు కళాశాల మెకానికల్ విభాగాధిపతి సత్యయ్య తెలిపారు. ప్రతిభ చూపిన ఈ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కాగా పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు కార్యక్రమానికి హాజరై విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ పరమేశ్వరీ ప్రశంసా పత్రంతో పాటు బహుమతులు అందజేశారు. ఇందులో ఆయా కళాశాలల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గుట్టుగా గుప్తనిధుల తవ్వకాలు



లింగాల శివారులో గుప్త నిధులకు కోసం త్రవ్వకాలు జరిపి రాత్రికి రాత్రే చదును చేసిన ప్రదేశం



లింగాల శివారులోని పోచమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు(ఫైల్)

- కొనసాగుతున్న దేవతావిగ్రహాల ధ్వంసం
- గతంలో పోచమ్మ, నంది విగ్రహాలు ధ్వంసం
- నేడు లింగాల శివారులో మరో గుప్త నిధుల తవ్వకాలు

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల పరిసర ప్రాంతాల్లో వివిధ దేవతామూర్తుల విగ్రహాల ధ్వంసం కొనసాగుతూనే ఉంది. లింగాలకు సమీపంలోని చాకిరేవుకుంట దగ్గర ఈ నెల 19న రాత్రి కొంతమంది గుర్తు తెలియని దుండగులు క్షుద్ర పూజలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. తవ్వకాలు చేసిన ప్రాంతంలో రాత్రికి రాత్రే జేసీబీతో చదును చేయిండంలో అనుమానాలకు తావిస్తోంది. 2022 మే 31 రాత్రి చెన్నంపల్లి వెళ్లే దారిలో శివాలయం ఎదుట ఉన్న నంది విగ్రహాన్ని ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనలో అప్పట్లో పదుల సంఖ్యలో అనుమానితులను విచారించినా పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ధ్వంసం చేసి ఎత్తుకెళ్లిన నంది విగ్రహం ఎక్కడ ఉందో కూడా నేటికి తెలియలేదు. అప్పట్లో దాతలు ముందుకు వచ్చి నంది, శివలింగం విగ్రహాలను మళ్లీ పునఃప్రతిష్ఠించారు. ఇది జరిగి నెల రోజులకే 2022 జూలై 12 రాత్రి లింగాల శివారులో గ్రామ దేవత పోచమ్మ దేవాలయంలో పోచమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దేవాలయాలపై దుండగులు దాడులు చేసి విగ్రహాలను ధ్వంసం చేయడం, ఎత్తుకెళ్లడం ఎవరికి అంతుపట్టడం లేదు. గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తే మరి విగ్రహాలు ఎత్తుకెళ్లడం ఎందుకనే ప్రశ్నలు మొదలయ్యాయి. నల్లమల అటవీ ప్రాంతంలోని పలు చెంచు పెంటల్లో గుప్త నిధుల వేట గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతోంది. నల్లమల ప్రాంతంలో పూర్వకాలంలో రాజులు నిర్మించిన ఎన్నో దేవాలయాలు, కోటలు శిథిలావస్థకు చేరడం, గుప్త నిధుల తవ్వకాలకు నిలయంగా మారుతున్నాయి. ఈ సమయంలో పోలీసులు ఉదాసీనత వహిస్తుండడంతో గుళ్లు, గోపురాలకు భద్రత లేకుండా పోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేల ఆరోగ్యానికి సేంద్రియ ఎరువులు

- పంట అవశేషాలతో తయారీ
- కోరమాండల్ ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ డా.సుబ్బారెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న డా. జీవీ సుబ్బారెడ్డి

బిజినేపల్లి: వ్యవసాయ భూమిని బలంగా, ఆరోగ్యంగా తయారు చేసుకోవడానికి రైతులు ఎక్కువగా సేంద్రియ ఎరువులనే వినియోగించాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రసిడెంట్ డా. జీవీ సుబ్బారెడ్డి సూచించారు. పంటలోని అవశేషాలను, పంట కోత అవశేషాలను సరియైన పద్ధతిలో వినియోగించడంతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చన్నారు. గురువారం పాలెం ఆర్ఏఆర్ఎస్‌లో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా.పి రఘురామిరెడ్డి మాట్లాడారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించి అవసరమైన రసాయనిక ఎరువులను వినియోగించాలని, అధికారులు సూచించిన మో తాదులో వాడాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయంలో నానో ఎరువులు అందుబాటులోకి వచ్చాయని, వాటిని ఆయా పంటల్లో ఆయా పద్ధతుల్లో వినియోగించాలన్నారు. రైతులు వ్యవసాయాన్ని వ్యాపార ధోరణిలో చూడాలని, అప్పుడే అధిక దిగుబడులు, లాభాలు వస్తాయన్నారు. ఆయా సాగు పంటలో కలుపు నివారణ పద్ధతులు వేర్వేరుగా ఉంటాయని, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ఉపయోగించి నివారించాలన్నారు. పంటల సాగులో రైతులు శారీరక శ్రమను తగ్గించడానికి యాంత్రీకరణను ఎక్కువగా వినియోగించాలని, దీనిపై రైతులు మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను రైతులు పరిశీలించారు. రైతుసదస్సుకు విశ్వవిద్యాలయం డీన్ ఆఫైర్స్ డా.సత్యనారాయణ, పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డా.మల్లారెడ్డి, కేవీకే కో ఆర్డినేటర్ డా.ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.పుష్పావతి, డీఏట చంద్రశేఖర్, కోరమాండల్ ప్రతినిధి డా.సుధాకర్, శాస్త్రవేత్తలు డా.కే. శ్రీధర్, డా.వాణిశ్రీ పాల్గొన్నారు.

'మత్స్య సహకార' సమరం



సొసైటీ సభ్యులకు ఎన్నికల నోటిఫికేషన్ పత్రాలను అందజేస్తున్న రఘునందన్‌రావు

- 31న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు
- నోటిఫికేషన్ విడుదల

కందనూలు: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల నగారా మోగింది. ఈనెల 31న ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ పాత సొసైటీ కార్యాలయంలో కోఆపరేటివ్ ఎన్నికల జిల్లా అధికారి, ఆడిట్ ఆఫీసర్ రఘునందన్‌రావు అధ్యక్షతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఎన్నికలు రెండు నెలల కిందట నిర్వహించాల్సి ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శితో పాటు 11 డైరెక్టర్ స్థానాలు ఉన్నట్లు తెలిపారు.

నోటిఫికేషన్ వివరాలు ఇలా..

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల జిల్లా కమిటీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు 27న ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నామినేషన్ దాఖలు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ ఉపసంహరణ ఉంటుంది. 31న ఉదయం 8గంటల నుంచి ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం ఫలితాలను విడుదల చేయనున్నారు. జిల్లాలో 223 గ్రామాల మత్స్య సహకార సంఘాల సొసైటీ అధ్యక్షులు ఓటర్లుగా ఉండనున్నారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ ప్రమోటర్ వాకిటి ఆంజనేయులు, ప్రమోటర్ తుమ్మల అల్లోజీ, గొడుగు సహదేవుడు, పెబ్బేటి నిరంజన్, పర్వతాలు, సత్యం, నాయకులు హరికృష్ణ, చాపల స్వామి, మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వామియే శరణం అయ్యప్ప



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో అయ్యప్ప మాలధారుడు సాయిరాజ నివాసంలో గురువారం పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామి చిత్రపటాలతో పాటు 18 పడిమెట్లను ఏర్పాటు చేసి భక్తిగీతాలను ఆలపించారు. భక్తులకు అన్నదానం చేశారు. గురుస్వామి తిరుపతయ్య, నవీన్‌కుమార్, నరేష్, వెంకటస్వామి, స్వామి పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పాతబజార్‌లో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు కపిలవాయి మహేష్‌చారి స్వగృహం వద్ద గురువారం ప్రముఖ కేరళ తాంత్రికవర్యులు వికే సతీష్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు.

గణితంలో పట్టు సాధించాలి

తెలకపల్లి: విద్యార్థులు గణితంలో పట్టు సాధించాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్ష పోటీలో మండలంలోని ఆలేరు ఉన్నత పాఠశాల తెలుగు మీడియం విద్యార్థి ఆర్ జశ్వంత్ జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ మేరకు గురువారం పాఠశాలలో విద్యార్థి జశ్వంత్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. గణిత ఉపాధ్యాయురాలు లావణ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, దేవరాజు, బాలకిషన్ రావు, జయశ్రీబాయి, విద్యావతి ఉన్నారు.

ముగిసిన మార్కెట్ కమిటీ స్టడీ టూర్

కొల్లాపూర్: కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు నాలుగు రోజుల పాటు చేపట్టిన స్టడీ టూర్ గురువారం ముగిసింది. సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్, కార్యదర్శి రాములు నేతృత్వంలో కమిటీ సభ్యులు స్టడీ టూర్‌కు వెళ్లారు. నిజామాబాద్, నాందేడ్, సోలాపూర్‌లోని మార్కెట్లను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో పంట కొనుగోళ్లు, విక్రయాలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. కొల్లాపూర్ మార్కెట్‌యార్డు అభివృద్ధికి దోహదపడే పలు అంశాలను అవగతం చేసుకున్నామని చైర్మన్ తెలిపారు.

శిల్పకళాకారులకు సన్మానం

తెలకపల్లి: మండలంలోని పలు దేవాలయాల విగ్రహాలను తమిళనాడు చెందిన శిల్పాకళాకారులు రామాంజనేయులు కొల్లప్ప, శనగమణి మురుగన్ కళానైపుణ్యంతో సుందరంగా తీర్చిద్దారన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వారిని సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య సన్మానించారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

అచ్చంపేట రూరల్: తాళం వేసిన ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు కన్నం వేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుడ్డతండా చెందిన బాలు హైదరాబాద్‌కు కూలీ పనుల కోసం వలస వెళ్లాడు. ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 19న ఇంటి తాళం విరగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో దాదాపు రూ.20 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు తీసుకెళ్లారు. బాధితుడు బాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ జిలాని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అచ్చంపేట రూరల్: ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ జిలాని తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన దాసర్ల రామస్వామి(40) తాగుడుకు బానిస అయ్యి ఈనెల 17న ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పారు. గాయపడిన రామస్వామిని అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఉస్మానియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తల్లి దాసర్ల నారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తు తెలియని బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తెల్కపల్లి నుంచి నాగర్‌కర్నూల్‌కు తాడూరు మండలానికి చెందిన అరుణ్, మురళిని బైక్‌పై వెళ్తున్నారు. మండలంలోని మంతటి క్రాస్ రోడ్డు వద్ద గుర్తుతెలియని ద్విచక్రవాహనం వారి బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో అరుణ్, మురళికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్

- చుట్టూ మురుగు, కంపచెట్లు
- రోడ్లపై నిల్చుంటున్న ప్రయాణికులు



బస్సు కోసం పరుగులు తీస్తున్న ప్రయాణికులు(ఫైల్)



బస్‌షెల్టర్ చుట్టూ నిల్వ ఉన్న మురుగు

కోడేరు: ప్రయాణికుల సౌకర్యార్థం మండలంలోని తీగలపల్లిలో బస్‌షెల్టర్‌ను నిర్మించారు. 15 ఏళ్ల కిందట నిర్మించడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. నిర్వహణ సరిగ్గా లేక వర్షపు నీరు, మురుగు బస్ షెల్టర్ చుట్టూ చేరింది. దీంతో గ్రామస్తులు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. బస్సుల కోసం వేచి ఉంటే కంపు వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వసతులు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సమీపంలో ఉన్న చెట్ల కింద నిలబడాల్సిన దుస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోయారు. బస్సు వచ్చిన వెంటనే పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు

గ్రామం నుంచి మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరం ఉంది. గ్రామానికి వనపర్తి, కొల్లాపూర్ డిపోల నుంచి బస్సులు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. మండల కేంద్రానికి విద్యాభ్యాసం కోసం విద్యార్థులు నిత్యం వెళ్లి వస్తుంటారు. ఎండ, వాన, చలికి రోడ్ల పక్కన ఉన్న చెట్ల కిందనే నిలుస్తున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. వృద్ధుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

రూ.5లక్షల నిధులతో..

గ్రామం మొత్తం జనాభా 2000వేల పైగా ఉంది. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా తీగలపల్లి గ్రామంలో 15 ఏళ్ల కిందట రూ.5 లక్షల నిధులతో బస్‌షెల్టర్ నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యంతో రూ.లక్షల నిధులు వృథా అయ్యాయని గ్రామస్తులు ఆరోపించారు. నిరుపయోగంగా మారిన బస్సు షెల్టర్‌కు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో బస్‌షెల్టర్ నిర్మాణం మున్నాళ్ల ముచ్చటగా మిగిలిందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికులకు అనుకూలంగా బస్సుషెల్టర్ నిర్మాణం చేపట్టలేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రామంలో నిర్మించిన బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారింది. చుట్టు నీరు ఉండటంతో లోపలికి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. దీంతో చెట్లకిందనే బస్సుల కోసం వేచి చూస్తున్నాం. వానకాలంలో విద్యార్థుల, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ చుట్టు ఉన్న మురుగును తొలగించి వినియోగంలోకి తీసుకురావాలి.

– లింగం, తీగలపల్లి

వినియోగంలోకి తెస్తాం



ప్రజల సౌకర్యార్థం 15 ఏళ్ల కిందట బస్‌షెల్టర్ నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది వాస్తవమే. ఇదివరకే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బస్‌షెల్టర్ చుట్టు కంపచెట్లను తొలగిస్తాం. మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపడతాం. గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా త్వరలో సమస్య పరిష్కరిస్తాం.

– శివారెడ్డి, సర్పంచ్, తీగలపల్లి

సెగ్రిగేషన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ ఆశ్రిత్ కుమార్

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీబీఎం కళాశాల వెనకాల ఉన్న చెత్త రీసైక్లింగ్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన డీఆర్‌సీసీ సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సెగ్రిగేషన్‌పై ఆర్పీలకు అవగాహన కల్పించారు. ఇటీవల ఆర్పీలకు మహబూబ్‌నగర్‌లో డీఆర్‌సీసీ సెంటర్‌ను నిర్వహిస్తున్న విజయలక్ష్మి ద్వారా పలు విషయాలను, సూచనలతో పాటుగా అందులోని అంశాలను స్టడీటూర్ ద్వారా వివరించారు. అదేవిధంగా మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపట్టిన పార్కు పనులను మున్సిపల్ చైర్మన్ సత్యం పరిశీలించారు. కౌన్సిలర్లు రవీందర్, సైదాబాబు, ఈఈ సాయిబాబు, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావన

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామానికి నాసిరకం కరెంటు సరఫరాపై అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం అసెంబ్లీ ప్రస్తావించారు. 25 ఏళ్ల కిందట నాసిరకం విద్యుత్ కేబుల్‌తో రోడ్డు మార్గం గుండా కాంట్రాక్టర్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దీంతో తరుచూ అటవీ సరిహద్దు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ప్రస్తావించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చత్రునాయక్, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

వేతనాల కోత అన్యాయం



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పెంట్లవెల్లి: గ్రామ పంచాయతీ కార్మికులు అనారోగ్యం గురై సెలవులు తీసుకుంటే వేతనాలలో కోత విధించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కార్మికులతో ఆయన ఎంపీడీఓ రామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్మికులకు సబ్బులు, నూనెలు, గ్లౌజులు, మాసుకలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కుర్మయ్య, శ్రీనివాసులు, లక్ష్మి, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వికసిత సంకల్ప యాత్ర

లింగాల: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత సంకల్ప యాత్రలో భాగంగా గురువారం మండలంలోని కోమటికుంట, అవుసలికుంట గ్రామాల్లో యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సలేశ్వరం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాల అందజేత

లింగాల: అసెంబ్లీ ఎన్నికల విధుల్లో అంకితభావంతో పనిచేసిన లింగాల పోలీసు స్టేషన్‌కు చెందిన పీసీలు నరేందర్, ప్రతాప్, బహదూర్‌లకు గురువారం జిల్లా కేంద్రంలో ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఎస్పీ వారిని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతు చేస్తునట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అచ్చంపేట, అమ్రాబాద్, పదర, బల్మూర్, ఉప్పునుంతల, లింగాల మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఊర్కొండ: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాత్రి మిడ్జిల్ వాగు నుంచి ఓ ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా రాంరెడ్డిపల్లి తండా సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. గురువారం ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సస్పెన్షన్ ఎత్తేయాలి

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన సర్పంచ్ పద్మపై సస్పెన్షన్‌ను ఎత్తేయాలని బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కావాలనే కుట్రతో సర్పంచ్‌పై సస్పెన్షన్ వేటు వేసి ఉప సర్పంచ్‌కు పదవీ బాధ్యతలు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చెక్కులపై ఉపసర్పంచ్, కార్యదర్శి, సర్పంచ్ ముగ్గురి సంతకాలు ఉంటాయని, చివరికి సర్పంచ్‌నే బాధ్యుడిని చేసి సస్పెన్షన్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం సస్పెన్షన్ ఎత్తివేయాలని ఆర్డీఓ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. పెద్దయ్య యాదవ్, రాజేందర్, సోమాజీ, ప్రదీప్, లక్ష్మయ్య గౌడ్ ఉన్నారు.

పకడ్బందీగా పంటల వివరాల నమోదు

కొల్లాపూర్: పకడ్బందీగా పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏఓ నాగరాజు సిబ్బందికి సూచించారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల ఏఈఓలతో ఆయన సమావేశం అయ్యారు. రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను సర్వే నెంబర్లు, విస్తీర్ణం వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

కల్వకుర్తి టౌన్: పట్టణానికి చెందిన అక్షర అండర్–17 ఫుట్‌బాల్ జాతీయ క్రీడలకు ఎంపిక కావటంతో విద్యార్థినిని మున్సిపల్ చైర్మన్ సత్యం గురువారం మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అభినందించారు. బీహార్‌లో జరిగే క్రీడలలో అక్షర విజయాన్ని సాధించి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు

ఉప్పునుంతల: నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు అన్నారు. గురువారం మండలంలోని మామిళ్లపల్లి తదతర గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఎంపీడీఓ సందర్శించారు. నర్సరీలో వివిధ రకాల మొక్కల కోసం కవర్లతో నాటిన విత్తనాలు, మొలకలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొలకెత్తని విత్తనాల స్థానంలో కొత్త విత్తనాలు నాటాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నర్సరీల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి పవన్ ఉన్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



భరత్

అచ్చంపేట రూరల్: స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కుడిచేటి భరత్ బాక్సింగ్ పోటీలో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాములు నాయక్ తెలిపారు. ఈనెల 19 నుంచి 20 వరకు వరంగల్ జిల్లాలోని తొర్రూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ పోటీల్లో 42 కిలోల విభాగంలో పాల్గొని స్వర్ణ పతకం సాధించాడు. ఈనెల 24వ తేదీ నుంచి 29 వరకు మహారాష్ట్రలోని అకోలా జిల్లా కేంద్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొంటాడని పేర్కొన్నారు. గురువారం వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్, పీఈటీ రమేష్, పీడీ శ్రీశైలం, కోచ్ శివకుమార్, బాక్సింగ్ కోచ్ శ్రీకాంత్ విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా పూజలు



పూజలు చేస్తున్న ఏపీ సీఎం జగన్ అభిమాని

అచ్చంపేట: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర ఆలయంలో ఆయన అభిమాని రమేష్‌నాయక్ ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఏపీ సీఎంగా మరోసారి విజయం సాధించాలని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు.

క్రిస్మస్ వేడుకలు

దోమలపెంట: స్థానిక క్రిస్టియన్ సెంటర్ చర్చిలో గురువారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు క్రిస్మస్ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన వారికి ఈ నెల 25న బహుమతులు అందజేస్తామని పాస్టర్ ఆశీర్వాదం తెలిపారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ

తాడూరు: ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన ఉండాలని ఏఓ సాయిరమేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలెం పరిశోధన కేంద్రంలో నిర్వహించే వివిధ అంశాలను వివరించారు. పరికరాలు, ఎరువుల వాడకం విధానంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఓ

లింగాల: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి ఏఓ నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో మండలంలోని లింగాల, అంబట్‌పల్లిలో కొనసాగుతున్న కేంద్రాలను గురువారం ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ శాతం 17 లోపల ఉన్న వరిధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. మొదటి రకం ధాన్యానికి రూ.2,203, రెండో రకం ధాన్యానికి రూ.2,183 మద్దతు ధర చెల్లిస్తామన్నారు. ఏఈఓ సురేంద్రరెడ్డి, సీఈఓ పాండు పాల్గొన్నారు.

గడప గడపకు రాజేషన్న భరోసా



అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

తాడూరు: మండలంలోని సిర్సవాడలో గడప గడపకు రాజేష్ అన్న భరోసా కార్యక్రమం గురువారం నాటికి మూడోరోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కార్యకర్తలు రాజు, వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల ద్వారా గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు ఆర్థికసాయం



దుస్తులు, నగదుతో విద్యార్థులు

అమ్రాబాద్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కేంద్ర ప్రాథమిక పాఠశాల లో చదువుతున్న 21 మంది అనాథ విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి మెమోరియల్ ట్రస్టు సభ్యుడు రాములు ఒక్కో విద్యార్థికి రెండు జతల దుస్తులు, రూ.1000 నగదు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి అయినా విష్ణువర్ధన్‌రెడ్డి అమెరికాలో ఉన్నప్పటికీ తాను చదువుకున్న పాఠశాలను మరిచి పోకుండా ప్రతి సంవత్సరం అనాథ విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకిషన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం సవరణకు వినతి



చారకొండ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చారకొండ: ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తోందని దీనిని సవరించాలని డీఎస్‌పీ నాయకులు కోరారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు తహసీల్దార్ ప్రమీలకు వినతి పత్రం అందించారు. నాయకులు చంద్రశేఖర్ మహరాజ్, వెంకటేష్, మల్లేష్, కొండల్, ఉదయ్ ఉన్నారు.

బల్మూర్: మహాలక్ష్మి పథకంలో సవరణలు చేయాలని డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సాయిమహారాజ్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణాలపై సవరణలు చేయాలని కోరుతూ తహసీల్దార్ సలీమోద్దీన్‌కు వినతి పత్రం అందించారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు సన్మానం



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

చారకొండ: అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణను గురువారం మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జూపల్లి వెంకటయ్య యాదవ్ సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, వెంకట్ గౌడ్, బీముడు నాయక్ తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

కోడేరు: మండలంలోని నాగులపల్లి తండా, తాగూరు తండాలో గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు డీటీఎఫ్ సీఈ పరమేష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గణపతి, కొల్లాపూర్ ఎస్‌ఐ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న క్రైస్తవులు

కల్వకుర్తిరూరల్: హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో గురువారం క్రైస్తవులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివప్రసాద్, క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, కమిటీ సభ్యులు దాసు, ప్రసాద్, టైలర్ అసోసియేషన్ కోశాధికారి సలీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

కల్వకుర్తిరూరల్: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని నియోజకవర్గ కాంగ్రెస్ యువ నాయకుడు వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యేకు మంత్రిగా బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అయోధ్య రామయ్య అక్షతల ఊరేగింపు

కందనూలు: జిల్లా కేంద్రంలో రామాలయ పారాయణ కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య రామయ్య అక్షతలు గురువారం ఊరేగించారు. అంతకు ముందు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి రామ్‌నగర్ కాలనీ రామాలయం వరకు భజనలు చేస్తూ ముందుకుసాగారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కమ్మేసిన మంచు

పెంట్లవెల్లి: వారం రోజుల నుంచి చలి తీవ్రత అధికంగా ఉంది. ఉదయం 9 గంటల వరకు కూడా రోడ్లపై మంచు దట్టంగా అల్లుకుంది. ప్రధాన రోడ్ల వెంట మంచు కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చలికి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. పనులను వాయిదా వేసుకుంటున్నారు. చలితీవ్రత ప్రభావం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తోంది.



మల్లేశ్వరంలో దట్టంగా కమ్మేసిన మంచు